సాక్షి
జగిత్యాల

బుధవారం : 28 : జూన్ : 2023



ప్రమాదకరంగా గోడ

బుగ్గారం : ఎన్‌హెచ్‌- 63పై ఎస్సారెస్పీ కాలువపై నిర్మించిన రక్షణ గోడ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది.



తెగిన విద్యుత్‌ తీగలు

కోరుట్ల : సంగెం–నాగులపేట శివారు ట్రాన్స్‌ఫార్మర్‌ సమీపంలో విద్యుత్‌ తీగలు తెగి ప్రమాదకరంగా మారాయి.

గరిష్టం/కనిష్టం
29.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

సీజనల్‌ వ్యాధుల నియంత్రణకు చర్యలు



దోమలమందు చల్లుతున్న దావ వసంత

జగిత్యాలజోన్‌: వర్షాకాలంలో సీజనల్‌ వ్యాధుల నియంత్రణకు గ్రామాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్‌ దావ వసంత సూచించారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో మంగళవారం వ్యాధుల నియంత్రణపై సమీక్షించారు. వర్షపునీరు నిల్వ ఉంకుండా చూడాలని కోరారు. కానుగ, వేపమొక్కలను విరివిగా నాటాలని సూచించారు. అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. ఓవర్‌హెడ్‌ ట్యాంకులను శుభ్రం చేయాలని కోరారు. అనంతరం కార్యాలయంలో దోమల నివారణ మందు చల్లారు. జెడ్పీ సీఈవో రామానుజాచార్యులు, డీపీవో దేవరాజ్‌, డీఎం అండ్‌ హెచ్‌వో శ్రీధర్‌, మిషన్‌ భగీరథ ఈఈ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాళ్లవాగు ప్రాజెక్టు కాలువ ఆధునికీకరణకు ప్రతిపాదనలు



కాలువ పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కథలాపూర్‌(వేములవాడ): రాళ్లవాగు ప్రాజెక్టుతో మండలంలో 3,500 ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యంగా కుడికాలువ సిమెంట్‌ లైనింగ్‌ పనులు చేయిస్తామని మార్క్‌ఫెడ్‌ మాజీ చైర్మన్‌ లోక బాపురెడ్డి తెలిపారు. రాళ్లవాగు ప్రాజెక్టు, భూషణరావుపేట, కోనాపూర్‌ శివారులోని కుడికాలువ, కల్వర్టులను ఇంజినీరింగ్‌ అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. కోనాపూర్‌, భూషణరావుపేట, కథలాపూర్‌, ఊటిపెల్లి గ్రామాల ఆయకట్టుకు సాగునీరు అందేలా ఆధునికీకరణ పనులు చేపట్టాలని, ఇందుకోసం రూ.20 కోట్లు అవసరమని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారని వివరించారు. కాగా, మంత్రి, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు కాలువ మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేశారు. జెడ్పీటీసీ నాగం భూమయ్య, నీటిపారుదల డీఈ ప్రశాంత్‌, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, కూన శ్రీనివాస్‌, పూంద్ర జనార్దన్‌, బద్దం మహేందర్‌రెడ్డి, ముస్కు శ్రీనివాస్‌, బోడ మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సేవలు అభినందనీయం



సామగ్రి అందిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

ధర్మపురి: పేద విద్యార్థులకు చేయూత అందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గొల్లపెల్లి గణేశ్‌ సేవలు అభినందనీయమని జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థి దత్తత కార్యక్రమం కన్వీనర్‌ గొల్లపెల్లి గణేశ్‌ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేసి మాట్లాడారు. గణేశ్‌ ఏడుగురు విద్యార్థులను దత్తత తీసుకొని సుమారు రూ.16 లక్షల వరకు ఖర్చు చేయడం గొప్ప విషయమన్నారు. సుమారు 3 వేల మందికి రూ.20 లక్షల విలువైన విద్యాసామగ్రి అందించిన ఘనత ఆ సంస్థకే దక్కిందని కొనియాడారు. ధర్మపురి, బుగ్గారం, బీర్‌పూర్‌ మండలాలకు చెందిన 750 విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు, నోటుబుక్కులు అందజేశారు. ఎంఈవో భూమయ్య, ప్రధానోపాధ్యాయుడు చెరుకు రాజన్న, దాతలు పాల్గొన్నారు.

పీఎఫ్‌ సదుపాయాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోరుట్ల: స్థానిక ఝాన్సీరోడ్డు ప్రావిడెంట్‌ ఫండ్‌ ఖాతాదారులకు కరీంనగర్‌ పీఎఫ్‌ రీజియన్‌ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి రామాచారి మాట్లాడుతూ నిధి ఆప్‌కే నికట్‌– 2లో భాగంగా ప్రతినెలా 27వ తేదీన పీఎఫ్‌ ఖాతాదారులకు సదుపాయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని తెలిపారు. పీఎఫ్‌ ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ అసిస్టెంట్లు పవన్‌ కుమార్‌, రమేశ్‌, ఖాతాదారులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లు టార్గెట్‌



ఈనెల 25న రాత్రి

- జిల్లా కేంద్రంలోని కరీంనగర్‌ రోడ్డు ఐటీసీ బ్రాండ్‌ షోరూమ్‌లో దొంగలు చొరబడి రూ.80 వేల నగదు, రూ.50 వేల విలువైన బంగారు, రూ.4 వేల విలువైన వెండి నాణేలు చోరీచేశారు.

ఈనెల 24న

- కోరుట్ల మండలం అయిలాపూర్‌, మెట్‌పల్లి, మాదాపూర్‌, పెద్దాపూర్‌ శివారుల్లోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగితీగను దొంగలు ఎత్తుకెళ్లారు.

ఈనెల 21న

- జగిత్యాల రూరల్‌ మండలం తాటిపల్లికి చెందిన పూదరి రాజవ్వ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. తాళం పగులగొట్టిన దొంగలు రూ.72,900 విలువైన బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించారు.

అదేరోజు

- ఇబ్రహీంపట్నం మండలం గోదూరులో జాగిరి రవీందర్‌ ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు.. అర్ధతులం కమ్మలు, బుట్టాలు, రింగు, రూ.40 వేల నగదు, తైదపెల్లి లారీ ఇంట్లో 10 గ్రాముల బంగారం అపహరించారు.

ఈనెల 19న రాత్రి

- వెల్గటూర్‌ మండలం పాశిగామ, కోటిలింగాల శివారుల్లోని వ్యవసాయ విద్యుత్‌ మోటార్లలోని రూ.2 లక్షల విలువైన కాపర్‌వైరు దొంగతనం చేశారు.

ఈనెల 18న

- కథలాపూర్‌ మండలం ఇప్పన్నపల్లి శివారు పెద్దమ్మతల్లి ఆలయంలో చొరబడిన దొంగలు.. 25 తులాల వెండి, అర్ధతులం బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు.

ఈనెల 15న రాత్రి

- కోరుట్ల పట్టణంలోని భీమునిదుబ్బ శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో చొరబడిన దొంగలు.. సుమారు రూ.30 వేల నగదు, వెండి ప్రతిమలు అపహరించారు.



దొంగతనం జరిగిన జిల్లా కేంద్రంలోని ఓ దుకాణంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు(ఫైల్‌)

- ఆలయాలనూ వదలని ముష్కరులు
- పాతనేరస్తులపై పోలీసుల అనుమానం
- నిఘా పటిష్టం చేసిన యంత్రాంగం
- వరుస దొంగతనాలతో వణుకుతున్న జిల్లావాసులు

జగిత్యాలక్రైం: జిల్లా పోలీసులు నిరంతరం గస్తీ కాస్తున్నారు.. సీసీ కెమెరాలు అణువణువూ పర్యవేక్షిస్తూ ఉన్నాయి.. మారుమూల ప్రాంతాల్లోనూ చీమ చిటుక్కుమన్నా రక్షకభటుల చెవుల్లో మార్మోగుతోంది.. అయినా, కొద్దిరోజులుగా చోరీల పరంపర కొనసాగడం పోలీసు శాఖ పనితీరుకు సవాల్‌ విసురుతోంది.

కంటిమీద కునుకులేకుండా..

- జిల్లాలో కొద్దిరోజులుగా జరుగుతున్న వరుస చోరీలు ప్రజల కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.
- తమపని నిమిత్తం ఇంటికి తాళం వేసి కాసేపు బయటకు వెళ్లి వచ్చేవరకే దొంగలు తమ పనికానిచ్చేస్తున్నారు.
- గ్రామాలే కాదు.. నిత్యం జనసంచారం ఉండే పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.
- ఇంటికి తాళం వేసి పోలీసులు, స్థానికులకు సమాచారం ఇచ్చి ఊళ్లు, తీర్థయాత్రలు, శుభ, అశుభ కార్యక్రమాలకు వెళ్లి వచ్చే సరికి ఇళ్లు గుల్ల అవుతున్నాయి.

సీసీ కెమెరాలున్నా..

- నేరాల నియంత్రణకు పోలీసు శాఖ 'నేను సైతం' కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా సుమారు 3,143 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఇందులో 151 పనిచేయడం లేదు. మిగతావి నిరంతరం నిఘా కాస్తున్నాయి. మరోవైపు కమ్యూనిటీ సీసీ కెమెరాలు 1,532 ఏర్పాటు చేయగా ఇందులో 113 పనిచేయడంలేదు. మిగతావి నిరంతరం పనిచేస్తున్నాయి. వీటితోపాటు బ్లూకోల్ట్స్‌ బృందాలు గస్తీ తిరుగుతున్నాయి. అయినా, చోరీలు ఆగడంలేదు.

రాత్రివేళల్లో చోరీలు..

- జిల్లాలో రాత్రివేళల్లోనే అధికంగా చోరీలు జరుగుతున్నాయి.
- తాళం వేసిన ఇళ్లను దొంగలు మధ్యాహ్నం పరిశీలించాక.. రాత్రివేళ చోరీలకు పాల్పడుతున్నారు.
- వారం రోజుల క్రితం గణేశ్‌నగర్‌లో మిట్ట మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి ఉండగా దొంగలు గుర్తించారు.
- రాత్రి 10 గంటల సమయంలో ఇంటి యజమాని నిద్రిస్తుండగా దొంగలు వంటగది తలుపులు తెరిచి చోరీకి యత్నించారు.
- మెలకువ వచ్చిన యజమాని.. గట్టిగా కేకలు వేయడంతో చోరులు పారిపోయారు.

పాతనేరస్తులపై నిఘా..

జిల్లాలో చోటుచేసుకుంటున్న వరుస దొంగతనాలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. పాత నేరస్తులే చోరీలకు పాల్పడుతున్నారని ఓ అవగాహనకు వచ్చినట్లు తెలిసింది. జైళ్ల నుంచి బయటకు వచ్చినవారిపైనా నిఘా పటిష్టం చేసింది. వారి కదలికలపై తరచూ సమాచారం సేకరిస్తోంది. ఏమాత్రం అనుమానం వచ్చినా అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తోంది.

> **నిఘా పటిష్టం చేశాం**
>
> పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి పని నిమిత్తం బయటకు వెళ్తే కచ్చితంగా పోలీసులు, స్థానికులకు సమాచారం ఇవ్వాలి. తద్వారా తాళాలు వేసిఉన్న ఇళ్లవద్ద నిఘా పెంచుతాం. తాళం వేసిన ఇళ్లల్లో విలువైన వస్తువులు ఉంచొద్దు.
>
> – భాస్కర్‌, ఎస్పీ

గ్రూప్‌–4 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్‌ యాస్మిన్‌ బాషా



యాస్మిన్‌ బాషా

జగిత్యాల: జిల్లాలో చేపట్టే గ్రూప్‌–4 పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్‌ యాస్మిన్‌ బాషా సూచించారు. ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షలను పారదర్శకంగా, సమస్యలు లేకుండా నిర్వహించాలని చెప్పారు. జూలై 1న గ్రూప్‌–4 పరీక్షలు ఉంటాయని తెలిపారు. గతంలో గ్రూప్‌–1 పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, గ్రూప్‌–4 పరీక్షను కూడా అలానే నిర్వహించాలన్నారు. గాలి, వెలుతురు ఉండేలా చూడాలన్నారు. తాగునీటి వసతి కల్పించాలని చెప్పారు. సౌకర్యవంతమైన మరుగుదొడ్లు ఉండేలా చూడాలన్నారు. సీసీ కెమెరాలను తరచూ పరిశీలించాలని అన్నారు. వర్షాకాలంతో ఆయా మార్గాల్లో ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలోని 73 పరీక్ష కేంద్రాల్లో 21,937 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో ఆశ, ఏఎన్‌ఎం కార్యకర్తలకు అవసరమైన మందులు సమకూర్చాలని ఆదేశించారు. అన్నిరూట్లలో బస్సు సౌకర్యం కల్పించాలని చెప్పారు. మహిళా అభ్యర్థులను మహిళా పోలీసులు మాత్రమే తనిఖీ చేయాలని ఆదేశించారు. ఉదయం 7.30 గంటలకే లైజన్‌చీఫ్‌ సూపరింటెండెంట్లు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్‌ పరికరాలు, ఖరీదైన వస్తువులను అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్‌ అమలులో ఉంటుందని వివరించారు. జిరాక్స్‌ కేంద్రాలను మూసివేస్తామని చెప్పారు. పరీక్ష కేంద్రాలకు చెప్పులు మాత్రమే ధరించి రావాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ లత, ఆర్డీవో వినోద్‌, డీఎస్పీలు ప్రకాశ్‌, రవీందర్‌రెడ్డి, విద్యాసంస్థల ప్రిన్సిపల్స్‌, లైజన్‌ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన అవసరం

- ఎస్పీ భాస్కర్‌



ఎస్పీ భాస్కర్‌

జగిత్యాలక్రైం: ఎన్నికల నియమావళి, ప్రవర్తనపై పోలీసు అధికారులకు అవగాహన అవసరమని ఎస్పీ భాస్కర్‌ సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎన్నికల సమయంలో పోలీస్‌ శాఖ తీసుకోవాల్సిన చర్యలు, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై పోలీసు అధికారులతో సమీక్షించారు. సాధారణ, సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలు గుర్తించి రెవెన్యూ అధికారులతో కలిసి ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. వీఐపీ, వీవీఐపీల పర్యటన సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. గంజాయి, పేకాట, గుడుంబాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్థలం అనువుగా ఉన్న పోలీస్‌స్టేషన్‌లలో మొక్కలు పెంచడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత ఎన్నికల సమయంలో మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కండక్ట్‌ కింద కేసులు నమోదు అయిన, భూతగాదాలు, పాత కక్షలు మనసులో పెట్టుకుని నేరాలు చేసేవారిని, నేర స్వభావం కలిగిన వారిని గుర్తించి తహసీల్దార్ల ఎదుట బైండోవర్‌ చేయాలని సూచించారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని అన్నారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ భాస్కర్‌ పోలీసు అధికారులకు సూచించారు.

ఉలిక్కిపడ్డ ఉమ్మడి జిల్లా

- రామగుండంలో తండ్రీకూతురిని అదుపులో తీసుకున్న ఏటీఎస్‌
- ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాని ఆరోపణలు
- విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తరలింపు


సాక్షి ప్రతినిధి, కరీంనగర్‌: ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో గుజరాత్‌ పోలీసులు రామగుండంలో తండ్రీకూతురిని అదుపులోకి తీసుకోవడం కలకలం సృష్టించింది. ఇటీవల శ్రీనగర్‌కు చెందిన నలుగురు ఇస్లామిక్‌ స్టేట్‌ సానుభూతిపరులను గుజరాత్‌ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్‌(ఏటీఎస్‌) అరెస్టు చేసింది. వారిలో సమేరా భాను అనే మహిళతో తెలంగాణలో పలువురు చాటింగ్‌ చేసినట్లు గుర్తించిన ఏటీఎస్‌ పోలీసులు పాతబస్తీతో పాటు వివిధ ప్రాంతాల్లో మంగళవారం దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్‌ డెవలపర్‌గా పనిచేస్తున్న తండ్రి (40), కూతురు (20) నాలుగు రోజుల క్రితం గోదావరిఖని శ్రీనగర్‌ కాలనీలోని బంధువుల ఇంట్లో షెల్టర్‌ తీసుకున్నారు. గుజరాత్‌ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రామగుండం సీపీ ఎదుట హాజరుపరిచారు. ఉగ్రవాదులతో సంబంధాలపై విచారించినట్లు సమాచారం. మీకు సమేరా భాను ఎలా పరిచయం? ఎన్ని రోజుల నుంచి తెలుసు? వారితో ఏంచాట్‌ చాట్‌ చేశారు? తదితర అంశాలపై ప్రశ్నించి స్టేట్‌మెంట్‌ రికార్డ్‌ చేశాక, హైదరాబాద్‌ తరలించారు.

ఉచిత శిక్షణ

జగిత్యాల: షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సివిల్స్‌ ప్రిలిమినరీ, మెయిన్స్‌ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు జూలై 2 వరకు పొడిగించినట్లు షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ అధికారి రాజ్‌కుమార్‌ తెలిపారు.

అదను దాటలేదు

- అన్నదాతల్లో ఆందోళన వద్దు
- వరిలో స్వల్పకాలిక రకాలు మేలు
- నేలలో తేమ ఉంటేనే విత్తనాలు వేయాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్‌



జగిత్యాలఅగ్రికల్చర్‌: ప్రస్తుతం సాగుకు అదను దాటలేదని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయాధికారి పాక సురేశ్‌కుమార్‌ సూచించారు. నేలలో తేమశాతం ఉంటేనే విత్తనాలు చల్లుకోవాలన్నారు. వరిలో 110–120 రోజుల కాలపరిమితి గల స్వల్పకాలిక రకం విత్తనాలు వాడడం మేలని చెప్పారు. సాగు సమస్యలపై 'సాక్షి' మంగళవారం నిర్వహించిన ఫోన్‌ ఇన్‌ కార్యక్రమం ద్వారా జిల్లాలోని చాలామంది రైతులు సురేశ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు. వారి మాటల్లోనే..

- ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించి సుమారు మూడు నెలలు గడుస్తున్నా స్పందన లేదు?
  – అంజిరెడ్డి, సారంగాపూర్‌

జిల్లా వ్యవసాయాధికారి : తొలివిడతలో బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.250 కోట్ల వరకు పరిహారం జమచేశాం. రెండోవిడత కోసం సర్కారుకు నివేదిక పంపించాం.

- వర్షాలు ఆలస్యం కావడంతో జీలుగ వేయలేదు?
  – గోలే రమేశ్‌, శంకరావుపేట, గొల్లపల్లి

జిల్లా వ్యవసాయాధికారి : జీలుగ వేసుకుని.. నారు పోయకుంటే పొలం సిద్ధమయ్యే వరకు దున్నవచ్చు. నారు పోస్తే, 45 రోజులకు బదులు 20 రోజుల్లో జీలుగ దున్నాలి.

- ఐదేళ్లయినా పంట రుణమాఫీ కాలేదు?
  – కాలగిరి సత్యనారాయణరెడ్డి, సారంగాపూర్‌

జిల్లా వ్యవసాయాధికారి : ఇప్పటికే రూ.50వేల లోపు రుణం మాఫీ అయ్యింది. మిగతా దానికోసం కమిషనరేట్‌ నుంచి వారంలో ఆదేశాలు రావొచ్చు.

- ప్రస్తుతం పసుపు, మక్క వేసుకోవచ్చా?
  – ఎల్క కమలాకర్‌, సంగెం శ్రీరాంపూర్‌, మల్లాపూర్‌

జిల్లా వ్యవసాయాధికారి : 60మి.మీ. నుంచి 70 మి.మీ వర్షపాతం నమోదై నేలతో తేమ ఉంటే పసుపు, మొక్కజొన్న వేసుకోవచ్చు.

- మా ఊరిలో 90మంది రైతులు వరిలో 1001 అంకూర్‌ రకం విత్తనం నారు పోశారు. ఇది మంచి విత్తనమేనా?
  – పుట్ట మహేశ్‌, సిరికొండ, బుగ్గారం

జిల్లా వ్యవసాయాధికారి : ఈ రకం విత్తనం ఎక్కడ సాగు చేశారు, దిగుబడి ఎంత వచ్చింది? రైతు ఎవరు అనే వివరాలు తెసుకుని సాగు చేయడం మంచిది.

- ప్రస్తుత వాతావరణం ప్రకారం ఏ పంటలు బాగా పండే అవకాశం ఉంది?
  – క్యాతం సాయిరెడ్డి, సింగరావుపేట, రాయికల్‌

జిల్లా వ్యవసాయాధికారి : అన్నిరకాల ఆరుతడి పంటలు వేయొచ్చు. వరిలో జేజీఎల్‌ –24423, కేఎస్‌ఎం–118 వంటి స్వల్పకాలిక రకాలు మేలు.

- ఇప్పుడు నారు పోస్తే దిగుబడి తగ్గుతుందా?
  – ఎలేటి మహేశ్‌రెడ్డి, పాత దాంరాజ్‌పల్లి, మల్లాపూర్‌

జిల్లా వ్యవసాయాధికారి : ఐఆర్‌–64, కేఎస్‌ఎం–118, జేజీఎల్‌–24423 వంటి స్వల్పకాలిక రకాల వరి నారు పోసుకోవచ్చు.

- పండ్ల తోటలకన్నా పామాయిల్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు?
  – మధుసూదన్‌రెడ్డి, సారంగాపూర్‌

జిల్లా వ్యవసాయాధికారి : వరి సాగు తగ్గించేందుకు ప్రభుత్వం పామాయిల్‌ సాగుపై దృష్టి పెట్టింది. అయినా, జామ, మామిడి తోటలకు కూడా రాయితీ ఇస్తోంది.

- నకిలీ విత్తనాలు వస్తున్నాయి. యూరియా కొరత ఉంటే రాజకీయ నాయకులకే అందిస్తున్నారు?
  – పెనుగుల అశోక్‌, వీవీరావుపేట, మల్లాపూర్‌

జిల్లా వ్యవసాయాధికారి : నకిలీ విత్తనాల కట్టడికి పోలీస్‌, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారు. సాధారణ రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా అందిస్తాం.

- ఉద్యాన పంటలకు డ్రిప్‌ ఇవ్వడం లేదు?
  – మల్లారెడ్డి, మోహన్‌రావుపేట, కోరుట్ల

జిల్లా వ్యవసాయాధికారి : పామాయిల్‌ వంటి పంటలకు డ్రిప్‌ ఇస్తున్నారు. వివరాలకు జిల్లా ఉద్యాన అధికారి ప్రతాప్‌సింగ్‌ను 79977 25061 నంబరులో సంప్రదించవచ్చు.

- పొడి దుక్కిలో వరి పండించాలనుకుంటున్న?
  – క్రాంతికుమార్‌, బండలింగాపూర్‌, మెట్‌పల్లి

జిల్లా వ్యవసాయాధికారి : మంచి ఆలోచన. ఇప్పటికే చాలామంది ఈ పద్ధతి పాటిస్తున్నారు. ఇందుకోసం సీడ్‌ డ్రిల్లింగ్‌ మిషన్‌ ఉంది.

- మొక్కజొన్నకు సబ్సిడీ ఉందా?
  – లింబారెడ్డి, మల్లాపూర్‌

జిల్లా వ్యవసాయాధికారి : ఏడాది పొడవునా వేసుకోవచ్చు. దిగుబడిలో మార్పు ఉండదు. ఈ పంటకు రాయితీ లేదు.

- కేఎస్‌ఎం–118 వరి రకం పడిపోతంది. జేజీఎల్‌ –24423 రకం గొలక విత్తులు రాలడం లేదు.
  – మెక్కొండ రాంరెడ్డి, అలూర్‌, రాయికల్‌

- ఈ సమస్యపై మేం వ్యవసాయ శాస్త్రవేత్తలతో చర్చిస్తున్నాం.

బండలింగాపూర్‌ మాకొద్దు

- కొత్త మండలంలో విలీనాన్ని వ్యతిరేకిస్తున్న గ్రామాలు
- రోడ్డెక్కిన మేడిపల్లి గ్రామస్తులు
- కార్యదర్శికి విన్నవించిన సత్తెక్కపల్లివాసులు



నిరసన తెలుపుతున్న మేడిపల్లి గ్రామస్తులు

మెట్‌పల్లి(కోరుట్ల): మెట్‌పల్లి మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులోని మేజర్‌ గ్రామపంచాయతీ బండలింగాపూర్‌ను పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం కొత్త మండలంగా ప్రతిపాదించింది. కొన్ని గ్రామాలను విలీనం చేస్తూ ప్రాథమిక నోటిఫికేషన్‌ జారీచేసింది. ఈ నిర్ణయాన్ని కొన్ని గ్రామాలు వ్యతిరేకిస్తున్నాయి. మెట్‌పల్లిలోనే కొనసాగించాలని కోరుతున్నాయి. జగ్గాసాగర్‌ గ్రామాన్ని కొత్త మండలంగా ప్రకటించాలని ఆ గ్రామస్తులు డిమాండ్‌ చేస్తున్నారు.

జాబితాలో 15 పంచాయతీలు..

- ప్రభుత్వం ఇటీవల జారీచేసిన ప్రాథమిక నోటిఫికేషన్‌లో బండలింగాపూర్‌తోపాటు చెర్లకొండాపూర్‌, సత్తెక్కపల్లి, రాజేశ్వర్‌రావుపేట, మేడిపల్లి, విట్టంపేట, మెట్లచిట్టాపూర్‌, జగ్గాసాగర్‌, రాంలచ్చక్కపేట, అల్లూరి సీతారామరాజుతండా, రంగారావుపేట, కేసీఆర్‌ తండా, ఆత్మకూర్‌, ఆత్మనగర్‌, పాటిమీది తండా గ్రామ పంచాయతీలు ఉన్నాయి.
- ఇందులో వెల్లుల్ల అనుబంధ రాంచంద్రంపేటను కూడా చేర్చారు.
- కొత్త మండలం ఏర్పాటుకు ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేసిన అధికారులు.. అభ్యంతరాల స్వీకరణకు 15రోజుల గడువు ఇచ్చారు.
- వాటిని పరిగణనలోకి తీసుకొని మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

వ్యతిరేకిస్తున్న గ్రామాలివే..

- మెట్‌పల్లి నుంచి విభజించి బండలింగాపూర్‌ మండలంలో కలపడాన్ని మేడిపల్లి, సత్తెక్కపల్లి, జగ్గాసాగర్‌ గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు.
- తమకు మెట్‌పల్లి అనుకూలంగా ఉంటుందని, అందులోనే కొనసాగించాలని మేడిపల్లి గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేశారు. సత్తెక్కపల్లి గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.
- జగ్గాసాగర్‌ గ్రామస్తులు ఆదినుంచీ మండలంగా ప్రకటించాలని పట్టుబడుతున్నారు. గతంలో ఆందోళనలు కూడా చేశారు.
- తమ డిమాండ్‌ను కాదని బండలింగాపూర్‌లో విలీనం చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- మళ్లీ ఉద్యమించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

బీఆర్‌ఎస్‌కు తలనొప్పి..

మరో ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో కొత్త మండలం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం సరికాదని బీఆర్‌ఎస్‌ స్థానిక నాయకులు అభిప్రాయపడుతున్నారు. కొత్త మండలాన్ని వ్యతిరేకిస్తున్న గ్రామాలకు అనుకూలంగా నిర్ణయాలు ఉండకపోతే.. ఆ ప్రభావం అసెంబ్లీ ఎన్నికల్లో చూపుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేటినుంచి ఎంసెట్‌ సర్టిఫికెట్ల పరిశీలన

జగిత్యాల: స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్‌ ప్రభుత్వ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాలలో ఈనెల 28 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు ఎంసెట్‌ సర్టిఫికెట్లు పరిశీలిస్తామని ఎంసెట్‌ జిల్లా కన్వీనర్‌ అశోక్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమవెంట ఒరిజినల సర్టిఫికెట్లతోపాటు ఒకసెట్‌ జిరాక్స్‌ తీసుకు రావాలని సూచించారు. ముందుగా స్లాట్‌ బుక్‌ చేసుకోవాలన్నారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల 3 వరకు రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతీ 30 నిమిషాలకోస్లాట్‌ ఉంటుందని పేర్కొన్నారు. స్లాట్‌ టైంలో కళాశాలకు విధిగా హాజరు కావాలని సూచించారు.

క్లుప్తంగా

'మేరా బూత్ సబ్‌సే మజ్బూత్' వీక్షణ



ప్రధాని మోదీ ప్రసంగం వింటున్న నాయకులు

జగిత్యాలటౌన్: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం భూపాల్‌లో నిర్వహించిన మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఆయన ప్రసంగాన్ని జగిత్యాలలోని ఓ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌పై బీజేపీ నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు, నాయకులు శైలేందర్‌రెడ్డి, మదన్‌మోహన్, వీరబత్తిని అనిల్‌కుమార్, ఆముద రాజు, జున్ను రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'అనుమతి లేని పాఠశాలల్లో చేరవద్దు'



అనుమతి లేని పాఠశాలకు తాళం వేస్తున్న ఎంఈవో గాయత్రి

సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాల: అనుమతి లేని పాఠశాలల్లో చేరవద్దని జగిత్యాల ఎంఈవో గాయత్రి అన్నారు. 'అనుమతి అక్కర్లేదా?' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 25న ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. మంగళవారం పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా నడిపిస్తున్న స్కూల్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. అనుమతి లేని స్కూళ్లలో విద్యార్థులను చేర్పించవద్దని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాలల్లో నిత్యం తనిఖీలు చేపడతామని పేర్కొన్నారు.

యువకుడి ఇంటి ఎదుట యువతి బైఠాయింపు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని చిన్నబొంకూర్‌కు చెందిన ఆర్నకొండ శంకర్ తనను మోసం చేశాడని ఓ యువతి మంగళవారం అతని ఇంటి ఎదుట బైఠాయించింది. బాధితురాలి వివరాల ప్రకారం.. ధర్మారం మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన యువతి, శంకర్ కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్న సమయంలో పరిచయమయ్యారు. ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా జాబ్ వచ్చిన తర్వాత చేసుకుంటానని నమ్మించాడు. తర్వాత అతను మరో అమ్మాయితో నిశ్చితార్థం చేసుకున్నట్లు తెలుసుకున్న బాధితురాలు తనకు న్యాయం చేయాలంటూ శంకర్ ఇంటి ఎదుట బైఠాయించింది. ఆమెకు పలువురు మహిళలు మద్దతు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో దొంగల బెడద

- 'గత శుక్రవారం జగిత్యాల మాతాశిశు సంరక్షణ కేంద్రంలో లక్ష్మి అనే గర్భిణి అడ్మిట్ అయ్యింది. ఓ యువకుడు ఆమె గదికి వచ్చి, మాకు ఇక్కడ బంధువులు ఉన్నారని మాటలు కలిపాడు. పక్కనే పెట్టుకున్న ఫోన్ ఎత్తుకెళ్లాడు. సీసీ కెమెరాలు పరిశీలిస్తే సదరు వ్యక్తి మాస్క్ పెట్టుకోవడంతో గుర్తించలేకపోయారు.'

- 'కస్తూరి వనిత గత శనివారం జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి వచ్చి, చికిత్స పొందుతోంది. రాత్రి పడుకున్న సమయంలో ఓ యువకుడు వచ్చి, ఆమె సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లాడు.'

- 'ఇబ్రహీంపట్నం మండలంలోని భర్తీపూర్‌కు చెందిన లక్ష్మి ఆదివారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతోంది. ఓ వ్యక్తి వచ్చి, పరీక్షలు చేయాలి. మెడలోని గొలుసు తీయాలన్నాడు. ఆమె నిజమే అనుకొని, గొలుసు ఇచ్చింది. దీంతో అతను అక్కడి నుంచి పరారయ్యాడు.'ఇలా దవాఖానాలో రోజుకో సంఘటన జరుగుతోంది. అయినా వైద్యాధికారులు సెక్యూరిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం లేదు.



జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

- మాస్క్ పెట్టుకొని, రోగులతో మాట కలుపుతారు..
- సెల్‌ఫోన్లు, ఆభరణాలు చోరీ
- సెక్యూరిటీ ఏర్పాటు చేయని వైద్యాధికారులు
- జగిత్యాలలో పరిస్థితి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతాశిశు సంక్షేమ కేంద్రంలో దొంగల బెడద ఎక్కువైంది. సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో లేకపోవడం, ఎలాంటి సెక్యూరిటీ లేకపోవడంతో పలువురు ఈజీగా చోరీలు చేస్తున్నారు. జనరల్ వార్డు, ఆపరేషన్ థియేటర్‌లో తమ బంధువులున్నారంటూ మాస్క్ పెట్టుకొని, లోపలికి వెళ్తున్నారు. రోగులతో మాటలు కలుపుతూ దొంగతనాలకు పాల్పడుతున్నారు.

పోలీసు అవుట్ పోస్ట్ లేదు..

ప్రభుత్వ ఆస్పత్రిలో తప్పకుండా పోలీసు అవుట్ పోస్ట్ ఉండాలి. ఒక హెడ్‌కానిస్టేబుల్‌తోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లు విధులు నిర్వహించాలి. కానీ జగిత్యాల దవాఖానాలో అలాంటిదేమీ లేదు. అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ ఎస్పీకి లేఖ రాశారు. కానీ ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. పెద్ద ఆస్పత్రి కావడం, నిత్యం 200 మందికి పైగా ఇన్‌పేషెంట్స్, వెయ్యికి పైగా అవుట్ పేషెంట్స్ వస్తుంటారు. తాజాగా మాతాశిశు సంక్షేమ కేంద్రం ఏర్పడగా గర్భిణులు అత్యధిక సంఖ్యలో వస్తున్నారు. దొంగల బెడద వారిని భయాందోళనకు గురిచేస్తోంది.

రోగులు జాగ్రత్తగా ఉండాలి

ప్రభుత్వ ఆస్పత్రిలో నిత్యం చోరీలు జరుగుతున్న మాట నిజమే. రోగులు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా ఎవరైనా వచ్చి, మాట్లాడినప్పుడు వారు ఎవరు అనేది తెలుసుకోవాలి. సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తున్నాం. పోలీసు అవుట్ పోస్ట్ కోసం ఎస్పీకి దరఖాస్తు చేశాం. పూర్తిస్థాయిలో నిఘా పెడతాం.

– రాములు, ఆస్పత్రి సూపరింటెండెంట్, జగిత్యాల

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: ప్రజల ఆశీర్వాదంతో బీఆర్‌ఎస్ మరోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఎక్కువకాలం అధికారంలోఉన్న కాంగ్రెస్ బీసీ వ్యక్తిని ఎందుకు సీఎంను చేయలేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ప్రశ్నించారు. స్థానిక పావని ఆస్పత్రిలో మంగళవారం సంజయ్ విలేకరులతో మాట్లాడారు. బీసీలపై ప్రేమ ఉంటే.. వారి అభ్యున్నతికి జీవన్‌రెడ్డి ఏంచేశారో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. బీసీ అభివృద్ధి పట్టని కాంగ్రెస్ పార్టీకి వారి ఓట్లు అడిగే హక్కులేదన్నారు. యూపీ, జార్ఖండ్ కంటే తెలంగాణలోనే విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి అధికంగా ఉందనే విషయాన్ని ఏబీవీపీ నాయకులు గుర్తించాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ, బీసీలు అందరూ సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో గీత కార్మికుల నుంచి చెట్టుపన్ను వసూలు చేశారని, దానిని రద్దుచేసిన ఘనత కేసీఆర్‌దే అని అన్నారు. సమావేశంలో నాయకులు బాలె శంకర్, బాల ముకుందం, డిష్ జగన్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో శ్రీధర్



అధికారులతో మాట్లాడుతున్న శ్రీధర్

జగిత్యాల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ప్రధానంగా కీటకజనీత, నీరు, ఆహార పదార్థాల కలుషితంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ముఖ్యంగా దోమలు, ఈగలు అభివృద్ధి చెందే ప్రదేశాల్లో వాటి ఉత్పత్తిని నియంత్రించాలని చెప్పారు. ఇంటి పరిసరాల్లో తాగి పడేసిన కొబ్బరిబొండాలు, పాతటైర్లు, పగిలిన కుండలు, మూతలు లేని నీటితొట్లు, బయట పడేసిన టీకప్పులు ఉంచకూడదని తెలిపారు. వీటిలో వర్షపునీరు నిండి కీటకాలు గుడ్లు పెట్టే అవకాశాలు ఉంటాయని అన్నారు. నీరు, ఆహార పదార్థాలు కలుషితం కావడానికి ఎక్కువగా అవకాశం ఉంటుందని, తద్వారా కామెర్లు, డయేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలుతాయని అన్నారు. పచ్చదనం పరిశుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్లు శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీధర్, వంశీ పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

- జిల్లా సంక్షేమాధికారి నరేశ్



మాట్లాడుతున్న నరేశ్

జగిత్యాల: అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ హెచ్చరించారు. స్థానిక ఎల్జీగార్డెన్స్‌లో జరిగిన జగిత్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతినెలా తొలివిడతలో నీలం, రెండోవిడతలో ఎరుపు, మూడోవిడతలో ఆకుపచ్చ రంగులోని కోడిగుడ్లు సరఫరా అవుతున్నాయని, క్రమపద్ధతి ప్రకారం వాటిని అందజేయాలని చెప్పారు. గుడ్లు దుర్వినియోగం కాకుండా ముద్ర వేస్తున్నారని, ఒక కోడిగుడ్డు బరువు 45 గ్రాములకన్నా తక్కువగా ఉన్నా, ముద్ర లేకున్నా, నాసిరకంగా ఉన్నా వాటిని స్వీకరించొద్దని చెప్పారు. పాలు, ఇతర పోషక పదార్థాల్లోనూ నాణ్యత ప్రమాణాలు పరిశీలించాలని సూచించారు. పిల్లల వృద్ధిపై పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి వీరలక్ష్మి, సూపర్‌వైజర్లు రాణి, జానకి పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): గోధూర్ సెంట్రల్ నర్సరీ మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా సాకిరాలకు చెందిన సారంగం సాయిరాం బైక్‌పై గోధూర్ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వస్తున్నాడు. గోధూర్ సెంట్రల్ నర్సరీ మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పడంతో కిందపడ్డాడు. మద్యం మత్తులో బైక్ నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఎస్సై ఉమాసాగర్ సంఘటన స్థలానికి చేరుకొని, గాయపడిన సాయిరాంను అంబులెన్స్‌లో మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించారు.

బావ చేతిలో బావమరిది హతం



రమేశ్ మృతదేహం

జగిత్యాలక్రైం: చెవికమ్మలు తాకట్టు పెట్టిన విషయంలో గొడవ పడిన ఓ వ్యక్తి తన బావమరిదిని హతమార్చాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని మిషన్‌కాంపౌండ్ ప్రాంతానికి చెందిన శివరాత్రి రమేశ్ (28) తన సోదరి జ్యోతి చెవికమ్మలు తాకట్టు పెట్టి, అప్పు తెచ్చుకున్నాడు. అనారోగ్యంతో బాధ పడుతున్న భార్య శైలజను ఆస్పత్రిలో చూపించాడు. దీంతో రమేశ్ బావ నాగదారి యాకూబ్ తన భార్య కమ్మలు ఎందుకు తాకట్టు పెట్టావంటూ సోమవారం రాత్రి అతనితో గొడవపడ్డాడు. బలంగా నెట్టివేయడంతో రమేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఎండీ అతీక్(25) కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మృతదేహాన్ని మంగళవారం ఎల్లారెడ్డిపేటకు తీసుకొచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. అతీక్ ఆరు నెలల క్రితం ముంబైకి వెళ్లి అక్కడే కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 24న ముంబై నుంచి కామారెడ్డికి రైలులో ప్రయాణం చేశాడు. మంగళవారం తెల్లవారుజామున కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో పట్టాలపై తీవ్ర గాయాలతో పడి ఉండటాన్ని గమనించిన రైల్వే పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి కుటుంబసభ్యులు సమాచారం అందుకొని మృతదేహాన్ని ఎల్లారెడ్డిపేటకు తరలించారు. చిన్న వయస్సులోనే అతీక్ అనుమానాస్పదంగా మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు అవివాహితుడు. కడు పేదరికం అనుభవిస్తున్న కుటుంబం కావడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఆర్థికసాయం కోసం అర్థిస్తున్నారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని స్థానిక మైనార్టీలు కోరుతున్నారు.

వీధి కుక్కల దాడిలో జింక..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లతిమ్మాపూర్ శివారులోని జక్కుల చెరువు ప్రాంతంలో మంగళవారం వీధి కుక్కల దాడిలో జింక అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. తిమ్మాపూర్ అటవీ ప్రాంతం నుంచి జింక దప్పిక తీర్చుకోవడానికి చెరువు వద్దకు వచ్చింది. అక్కడికి గుంపుగా చేరుకున్న కుక్కలు ఒక్కసారిగా జింకపై దాడి చేయడంతో తీవ్రగాయాలకు గురై సంఘటన స్థలంలోనే మృతి చెందింది. గ్రామస్తులు అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రావుకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులతో పాటు పోలీసులు, పశువైద్యాధికారులు ఘటన స్థలానికి వెళ్లి, పోస్టుమార్టం నిర్వహించి, పూడ్చి పెట్టారు.

ప్రమాదాలు చేయకున్నా.. చేసినట్లు

- తప్పుడు రిపోర్టు ఇచ్చిన ఆర్టీసీ ఉద్యోగి
- ప్రైవేటు బస్సుల డ్రైవర్ల జీవితాలతో చెలగాటం
- పొరపాటు జరిగింది : డీఎం



యాక్సిడెంట్లు చేసినట్లు ఇచ్చిన రిపోర్టు

కోరుట్ల: ప్రైవేటు బస్సుల డ్రైవర్లు ఆర్టీసీ సిబ్బంది చేస్తున్న తప్పిదాలతో ఇబ్బంది పడుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు చేయకున్నా కోరుట్ల డిపోకు చెందిన ఇద్దరు ప్రైవేటు డ్రైవర్లను ట్రెనింగ్‌కు పంపించడం ఆర్టీసీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. గంగాధర్, రాజేందర్ కోరుట్ల ఆర్టీసీ డిపోలో ప్రైవేటు బస్సు డ్రైవర్లుగా ఆరేళ్లుగా పని చేస్తున్నారు. ఇప్పటివరకు వారు ఎలాంటి ప్రమాదాలు చేయలేదు. కానీ ఇటీవల ఓ రిపోర్టులో ఆర్టీసీ ఉద్యోగి ఒకరు వీరిద్దరూ మైనర్ యాక్సిడెంట్లు చేసినట్లు ఉన్నతాధికారులకు రిపోర్టు చేయడం.. ఇద్దరికీ మళ్లీ ప్రత్యేకంగా ట్రెనింగ్ ఇప్పించారు. ప్రమాదాలు చేసినట్లుగా రిపోర్టు చేస్తే రానున్న కాలంలో తమ ఉద్యోగాల పర్మినెంట్ సమయంలో సమస్యలు ఎదురవుతాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డీఎం ప్రసూనలక్ష్మిని వివరణ కోరగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పొరపాటున ఈ డ్రైవర్లు ప్రమాదాలు చేసినట్లుగా రిపోర్టు ఇచ్చారని, బాధితులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తామని తెలిపారు.

మహిళా సమాఖ్యలపై వివక్ష తగదు



బల్దియా ఎదుట నిరసన తెలుపుతున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

- టీఎల్‌ఎఫ్ భవనాన్ని మహిళలకే అప్పగించాలి
- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి

జగిత్యాలటౌన్: మహిళా సమాఖ్యలపై ప్రభుత్వం వివక్ష చూపించవద్దని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. బాలరక్షక్ సదన్‌కు కేటాయించిన టీఎల్‌ఎఫ్ భవనాన్ని మహిళలకే కేటాయించాలనే డిమాండ్‌తో స్థానిక బల్దియా ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. విజయలక్ష్మి మాట్లాడుతూ, ఏళ్లుగా 60 సమాఖ్యలు, 60మంది అధ్యక్షులు, 60మంది రిసోర్స్‌పర్సన్లు ప్రతినెలా ఇందులో సమావేశమవుతారన్నారు. దానిని బాల రక్షక్ సదన్‌కు కేటాయిస్తే కుట్టుమిషన్లకు రక్షణ లేకుండాపోతుందని అన్నారు. బాల రక్షక సదన్‌కు తాము వ్యతిరేకం కాదని, టీఎల్‌ఎఫ్ భవనాన్ని మహిళా సమాఖ్యకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గిరి నాగభూషణం, కల్లెపెల్లి దుర్గయ్య, నక్క జీవన్, అసియా సుల్తానా, సహారా అన్జుం, అల్లాల సరిత, బింగి సుమ, పులి సునీత, గాజుల రాజేందర్, శేఖర్, మన్సూర్, నేహాల్, గుండ మధు, చాంద్‌పాషా, కచ్చు హరీశ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పఠనోత్సవం



పొరండ్ల ప్రభుత్వ పాఠశాలలో రీడింగ్ క్యాంపెయిన్‌ను పర్యవేక్షిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

- జూలై 31 వరకు నిర్వహణ
- 1 నుంచి 10వ తరగతుల విద్యార్థులు ధారాళంగా చదివేలా విద్యాశాఖ చర్యలు
- జిల్లాలో సర్కారు బడులు 835

మల్లాపూర్(కోరుట్ల): ప్రతీరోజు పుస్తక పఠనం చేస్తే విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనలు, జ్ఞానం వికసిస్తాయి. పిల్లల్లో పఠన సామర్థ్యం పెంపొందించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విద్యార్థులు ధారాళంగా చదువుతూ.. మెరుగైన అభ్యసన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పఠనోత్సవం(రీడింగ్ క్యాంపెయిన్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2023–24 విద్యాసంవత్సరానికిగాను ఈ నెల 26 నుంచి జూలై 31 వరకు దీన్ని నిర్వహించనుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 1 నుంచి 10వ తరగతి వరకు చేపట్టబోయే షెడ్యూల్ సైతం విడుదల చేశారు. పిల్లలు నిత్యం చదవడం అలవాటుగా మార్చుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.

ప్రతి పీరియడ్‌లో చివరి 10 నిమిషాలు..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రీడింగ్ క్యాంపెయిన్ అమలు చేస్తున్నారు. తరగతుల వారీగా చేపట్టే ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రతి పీరియడ్‌లో సబ్జెక్టుకు సంబంధించిన బోధన పూర్తయిన తర్వాత, బోధించిన అంశాన్ని చివరి 10 నిమిషాల వ్యవధిలో విద్యార్థులతో పఠనం చేయించాలి. బ్లాక్ బోర్డుపై కఠిన పదాలు, సరళ పదాలను రాయాలి. ప్రతిరోజూ ప్రార్థన సమయంలో ఏదో ఒక అంశాన్ని చదివేలా చూడాలి. మూడు రోజులు మాతృభాషలో, రెండు రోజులు ఆంగ్లభాషలో, ఒకరోజు ద్వితీయ భాషలో చదివించాలి.

వారానికోసారి పోటీలు..

పఠనాసక్తిని పెంపొందించేందుకు విద్యార్థులకు వారానికోసారి పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, పిల్లలు చదువుతున్న తీరు వివరిస్తారు. గ్రంథాలయంలో విద్యార్థుల ద్వారా కమిటీలు వేసి, తోటి విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడం, తీసుకోవడం, రికార్డుల్లో రాయడం చేయిస్తారు.

10 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

జగిత్యాల జిల్లాలోని 835 ప్రభుత్వ పాఠశాలల్లో జూలై 10 నుంచి 15 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివిస్తారు. దినపత్రికల్లో వచ్చిన మ్యాగజైన్‌లు, బొమ్మలను సేకరిస్తారు. తల్లిదండ్రుల సమక్షంలో ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. ఇదంతా రాష్ట్రస్థాయి మానిటరింగ్ కమిటీ పర్యవేక్షించనుంది. ఈ కార్యక్రమం పకడ్బందీగా అమలు చేస్తే పిల్లలకు మేలు జరుగుతుంది.

పఠన సామర్థ్యం పెంచేందుకే..



విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంచేందుకే పాఠశాలల్లో రీడింగ్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. దీని విజయవంతానికి ఉపాధ్యాయులకు ఆదేశాలిచ్చాం. రాష్ట్రస్థాయి మానిటరింగ్ కమిటీలు పర్యవేక్షిస్తాయి.

– జగన్మోహన్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి

అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడ సమీప బీరయ్యగుడి ప్రాంతానికి చెందిన స్వప్నను అదనపు కట్నం కోసం వేధించిన ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఆయన వివారల ప్రకారం.. బీరయ్యగుడి ప్రాంతానికి చెందిన స్వప్నకు హైదరాబాద్‌లోని అంబారిపేటకు చెందిన గోపతి నరేశ్‌తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.10 లక్షలు, 15 తులాల బంగారం కట్నంగా ముట్టజెప్పారు. ఈ క్రమంలో కొంతకాలంగా అదనపు కట్నం కావాలంటూ భర్త నరేశ్, అత్త ఇంద్ర, ఆడబిడ్డ బోడకుంట్ల స్వప్న ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. భర్త అతిగా మద్యం తాగి వచ్చి, స్వప్నను చంపేందుకు ప్రయత్నించగా పారిపోయి పుట్టింటికి వచ్చింది. బాధితురాలు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాడి ఘటనలో తండ్రీకుమారుడిపై..

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని అర్పపల్లి గ్రామంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన తండ్రీకుమారుడిపై కేసు నమోదు చేసినట్లు సారంగాపూర్ ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అర్పపల్లి గ్రామానికి చెందిన గెంటె లచ్చయ్య, అతని కుమారుడు మహేశ్‌తోపాటు గ్రామంలోని ఓ సామాజికవర్గానికి చెందినవారు మంగళవారం చెట్ల తీర్థాలకు వెళ్లారు. అక్కడ పాత గొడవలను మనసులో పెట్టుకొని, లచ్చయ్య, మహేశ్‌లు అదే గ్రామానికి చెందిన చిర్రం గంగయ్యపై దాడి చేశారు. ఈ ఘటనలో అతనికి గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తండ్రీకుమారుడిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కుడిదుల రాజేందర్(38) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. హమాలీ పనులు చేసే రాజేందర్‌కు భార్య రమ, కూతురు ఉన్నారు. అతను కొంతకాలంగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటినుంచి బయల్దేరి కొలనూర్ వైపు వెళ్లేదారిలో వ్యవసాయ బావి పక్కన చెట్టుకు సర్వీస్ వైరుతో ఉరేసుకున్నాడు. ఆ తీగ తెగిపోవడంతో వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. కుటుంబసభ్యులు రాజేందర్ కోసం చుట్టుపక్కల వెతకగా మంగళవారం బావిలో అతని మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

పెద్దపల్లి పట్టణంలోని కొంతం వాడకు చెందిన జిల్లెల్ల సాయికుమార్(27) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మందమర్రికి చెందిన అనూషతో సాయికుమార్‌కు వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. సాయికుమార్ మద్యానికి బానిసయ్యాడని, ఎంత చెప్పినా మారడం లేదని అనూష మూడేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం అత్తగారింటికి వెళ్లిన సాయికుమార్ కుమారుడిని తన వెంట తీసుకువచ్చాడు. భార్య కాపురానికి రావడం లేదని జీవితంపై విరక్తి చెంది, మంగళవారం ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంజన్న ఆలయ ఆవరణలో భక్తుడి మృతి

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం ఉదయం కట్టలింగాపూర్‌కు చెందిన ఎల్ల నర్సయ్య(60) అకస్మాత్తుగా కుప్పకూలి, మృతిచెందినట్లు ఏఎస్సై రమణారెడ్డి తెలిపారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించాక అర్చకులు సంప్రోక్షణ చేసి, భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు